# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-04-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఈ నెల 22వ తేదీన జరిగిన ఉగ్రవాద దాడి కేసు దర్యాప్తును కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జాతీయ దర్యాప్తు సంస్థ..ఎన్ఐఏకు అప్పగించింది.

**2.** మత్స్యకారుల జీవనప్రమాణాలను మెరుగుపర్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు.

**3.** రోజ్‌గార్ మేళాల ద్వారా ఇప్పటి వరకు 9 లక్షల 25 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు.

**4.** దేశాభివృద్ధిలో ఆంధ్ర విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషించిందని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి చైర్మన కె.మధుమూర్తి అన్నారు.

**5.** ప్రపంచవ్యాప్తంగా మానవాళి ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభాల పరిష్కారానికి ఏకమవుతామని హైదరాబాద్‌లో నిర్వహించిన భారత్ సమ్మిట్ పేర్కొంది.

**6.** ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం ఈ ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

==========================

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఈ నెల 22వ తేదీన జరిగిన ఉగ్రవాద దాడి కేసు దర్యాప్తును కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జాతీయ దర్యాప్తు సంస్థ..ఎన్ఐఏకు అప్పగించింది. ఇప్పటికే ఎన్ఐఏ బృందం ఉగ్ర దాడి జరిగిన ప్రదేశాన్ని సందర్శించి, ప్రాథమిక సమాచారం సేకరించింది. ఈ ఉగ్రవాద దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దాడికి సంబంధించిన ముమ్మర దర్యాప్తును ప్రారంభించిన ఎన్ఐఏ, నిందితులను గుర్తించి, దాడి వెనుక ఉన్న ఉగ్రవాద సంస్థలను వెలుగులోకి తెచ్చేందుకు చర్యలు ముమ్మరం చేయనుంది. మరోవైపు.. రక్షణ బలగాల కదలికలు, ఆపరేషన్లను ప్రత్యక్షంగా ప్రసారం చేయవద్దని వార్తా సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ తరహా ప్రసారాలు దేశ శత్రువులకు ఉపయోగకరం కావచ్చని అభిప్రాయపడింది. పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో రక్షణ వ్యవహారాలపై వార్తా కథనాలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది.

-------------------------

మత్స్యకారుల జీవనప్రమాణాలను మెరుగుపర్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చర్ల నియోజకవర్గం బుడగట్లపాలెంలో నిన్న నిర్వహించిన 'మత్స్యకారుల సేవలో' కార్యక్రమంలో చేపల వేట విరామ సమయానికి ప్రకటించిన భృతిని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఉత్పత్తయ్యే మత్స్య సంపదలో 29 శాతం ఆంధ్రప్రదేశ్ నుంచే ఉంటుందని చెప్పారు. మత్స్యకారుల పిల్లల్ని చదివించే బాధ్యత తీసుకుంటామని, ఇప్పటికే 6 రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేశామని చంద్రబాబునాయుడు వివరిస్తూ..

..వాయిస్.. 38 సెకన్లు

ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లా నుంచి వలసలను కట్టడి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

---------------------------

రోజ్‌గార్ మేళాల ద్వారా ఇప్పటి వరకు 9 లక్షల 25 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నిన్న నిర్వహించిన 'రోజ్‌గార్ మేళా'లో ఆయన, బాగ్‌లింగంపల్లిలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర జలశక్తి సహాయ మంత్రి రాజభూషణ్ చౌధరి పాల్గొని.. ఉద్యోగాలకు ఎంపికైన 230 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. అవినీతికి, పొరపాట్లకు తావులేకుండా నిర్ణీత గడువులోగా లక్షల ఉద్యోగాలను భర్తీ చేయడం గొప్ప విషయమని అన్నారు. రాజభూషణ్ చౌధరి మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ఉపయుక్తంగా ఎప్పటికప్పుడు కొలువులను సృష్టించేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు.

---------------------------

ఆహారాన్ని ఔషధంగా, వంట గదిని ఔషధశాలగా భావించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. రాబోయే పదేళ్లలో మనం ఎలా ఉండాలో ఇప్పుడే ఆలోచించాలని పిలుపునిచ్చారు. ఆంధ్ర వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సమన్వయంతో విశాఖపట్నంలో 50 కోట్ల రూపాలయలతో నిర్మించిన అంబేడ్కర్ శతాబ్ది అలుమ్ని భవనాన్ని నిన్న ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ.. టెక్నాలజీ, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని తెలిపారు. కేజీహెచ్‌లో 60 కోట్ల రూపాయలతో లెవల్-2 క్యాన్సర్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి వివరిస్తూ..

...వాయిస్.. 32 సెకన్లు

---------------------------

జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో 'భారత ప్రభుత్వం అత్యవసర భద్రతా సలహా' పేరుతో సామాజిక మాధ్యమాల్లో అసత్య వార్తలు ప్రచారం చేయడంపై ఆంధ్రప్రదేశ్ పోలీస్ డైరెక్టర్ జనరల్ హరీశ్‌కుమార్ గుప్తా ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర నిఘా సంస్థల హెచ్చరికల పేరుతో కొందరు వదంతులు వ్యాప్తి చేస్తున్నారని, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలను హై-అలర్ట్ జోన్లుగా ప్రకటించారని దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. హై- అలర్ట్ జోన్స్ గురించి కేంద్ర ప్రభుత్వం గానీ, రాష్ట్ర ప్రభుత్వంగానీ ఎలాంటి ప్రకటన చేయలేదని డీజీపీ స్పష్టం చేశారు. ఈ తరహా వార్తలను ఎవరూ నమ్మవద్దని.. వదంతులు వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

---------------------------

సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టంచేశారు. హైదరాబాద్‌లో జరిగిన భారత్ సమ్మిట్‌లో నిన్న ఆయన మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను తీసుకొచ్చామని తెలిపారు. దేశంలోనే అతిపెద్ద రైతు రుణమాఫీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, ఇప్పటికే 20 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. గత పదేళ్లలో ప్రపంచ రాజకీయాలు మారిపోయాయని అన్నారు. రాజకీయాల్లోకి కొత్తతరం రావాలని.. అప్పుడే కొత్త ఆలోచనలు పుట్టుకొచ్చి, దేశం అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందని రాహుల్ గాంధీ తెలిపారు.

---------------------------

ప్రపంచవ్యాప్తంగా మానవాళి ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభాల పరిష్కారానికి ఏకమవుతామని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ సంస్థలను మరింత సమర్థంగా తీర్చిదిద్దుతామని భారత్ సమ్మిట్ పేర్కొంది. వివిధ రూపాల్లోని ఉగ్రవాదాన్ని, దానికి మద్దతు ఇస్తున్న దేశాల వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు జరిగిన భారత్ సమ్మిట్లో వందకు పైగా దేశాల నుంచి 400 మందికి పైగా ప్రగతిశీల, సామాజిక–ప్రజాస్వామ్య, సామ్యవాద, కార్మిక ఉద్యమాల ప్రతినిధులు పాల్గొన్నారు. సదస్సు చేసిన తీర్మానాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వివిధ దేశాల ప్రతినిధులతో కలిసి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విడుదల చేశారు.

---------------------------

దేశాభివృద్ధిలో ఆంధ్ర విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషించిందని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి చైర్మన కె.మధుమూర్తి అన్నారు. విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం శత వసంతోత్సవం సందర్భంగా ఏయూ కన్వెన్షన హాల్‌లో శతాబ్ది ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎంతోమంది శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, విభిన్న రంగాలకు చెందిన వారిని ఆంధ్ర విశ్వవిద్యాలయం దేశానికి అందించిందని తెలిపారు. విద్యార్థులు విజ్ఞానంతోపాటు విలువలతో కూడిన జీవనాన్ని నేర్చుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషిచేసిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా మధుమూర్తి ధన్యవాదాలు తెలియజేశారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 121వ సంచిక ఈ ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

ప్రపంచ దేశాలన్నీ రక్షణ రంగం, వ్యూహాత్మక మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెడుతున్నాయని, ఈ నేపథ్యంలో భారతదేశంలో ఈ రంగాలకు చెందిన పరిశ్రమలకు మంచి భవిష్యత్తు ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అంతరిక్ష, రక్షణ తయారీ రంగాల గౌరవ సలహాదారు డాక్టర్ జి.సతీశ్‌రెడ్డి తెలిపారు. భారత పరిశ్రమల సమాఖ్య..సీఐఐ, సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరర్స్..ఎస్ఐడీఎం సంయుక్తంగా విశాఖపట్నంలో నిన్న నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసగించారు.

======================